క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



చేబ్రోలు: స్థానిక లక్ష్మీ గోదావరి స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గురుశెట్టి, సోమనాథ్‌లు గంజాయి తాగటానికి అలవాటు పడటంతో పాటు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కొత్తరెడ్డిపాలెంలో బాలకృష్ణ అనే వ్యక్తి దగ్గరకు గంజాయిని విక్రయించేందుకు వెళ్తున్న గురుశెట్టిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి కిలో గంజాయిని, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గురుశెట్టిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పొన్నూరు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో చేబ్రోలు ఎస్ఐ పి. మహేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం

నెహ్రూనగర్: తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో డీఫిల్టరేషన్ ప్లాంటు వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు నగరంలో తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజీవ్ గాంధీ నగర్, వసంతరాయపురం, హనుమయ్యనగర్, నెహ్రూనగర్, శారదా కాలనీ రిజర్వాయర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

అంగరంగ వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



పాత గుంటూరు: బ్రాడీపేట ఓంకార క్షేత్రం పాలకమండలి కార్యదర్శి నంబూరు శ్రీమన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో 90వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలలో భాగంగా బుధవారం నిత్య పూజలు, శ్రీరామ పట్టాభి షేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాల్ని అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, పూజల్లో పాల్గొన్న దంపతులు శ్రీ రామ పాదుకలను తలపై ఉంచుకుని, ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం శాంతి హోమం పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, భక్తులకు అన్నదానం నిర్వహించారు. శ్రీ సీతారామ పరివారంతో జరిగిన నగరోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి.

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ట



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లో ఆధునికీకరించిన హిందూ బీఈడీ కళాశాల ప్రాంగణంలో బుధవారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చింతలపాటి వేంకట రామయ్య దంపతుల ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహానికి జలాధివాస, ధాన్యాధివాస కార్యక్రమాలతో పాటు మంత్రపూరితమైన పవిత్రజలంతో అభిషేకించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలతో పాటు సరస్వతీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆధునికీకరించిన భవనాన్ని డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మాజేటి సోమశేఖరరావు, హిందూ కాలేజీ హైస్కూల్ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు సూచించారు. కొత్తపేటలోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టు నమూనాలతో పాటు వర్కింగ్ మోడల్స్ తిలకించి, వారిని అభినందించారు. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని, అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని ప్రశంసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల గైడెన్స్‌లో విద్యార్థులు ఎంతో కష్టపడి శాస్త్ర, సాంకేతిక, విద్యా, పర్యావరణ అంశాల సమాహారంగా 180 ప్రాజెక్టులను తయారు చేసి, ప్రదర్శించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ బాలకృష్ణ, నవీన్, అకడమిక్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, ఏఓ బోస్, ఏజీఎం భానుప్రసాద్, ఇన్‌చార్జ్ జైమున్నీసా బేగం పాల్గొన్నారు.

బూత్ లెవల్ నాయకులే విజయానికి సారథులు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ స్థాపనకు వారధులు బూత్‌లెవల్ నాయకులని ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గం బూత్‌లెవల్ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం వై.జంక్షన్‌లోని వీఆర్‌కే కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి పాల్గొన్న సమన్వయకర్త బలసాని ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభివృద్ధికి, 2019లో పార్టీ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు బూత్‌లెవల్ నాయకులు, కన్వీనర్లు చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి అఖండ మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరం సైనికుల్లా పని చేద్దామని పిలుపునిచ్చారు. జగనన్న ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభ్యర్థిగా తనను పంపారని, ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని కుటుంబ సభ్యుడుగా ఆదరించి తనను గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికలకు ముందస్తుగా బూత్ లెవల్ నాయకులు తమ పరిధిలోని వలంటీర్ల సహాయంతో ప్రతి కుటుంబాన్నీ కలిసి ప్రభుత్వం, జగనన్న చేసిన మేలును వివరించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో బూత్‌లెవల్‌లో చేపట్టాల్సిన విధి విధానాలు, ఓటరు కార్డు తనిఖీ తదితర విషయాలను వివరించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేద్దామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికీ, ప్రజలకు వారధులు వలంటీర్లు

కాకుమాను: ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. కాకుమాను గ్రామ సచివాలయం–2లో బుధవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను వలంటీర్లు సకాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వెళ్లి అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని ప్రశంసించారు. కరోనా కష్ట కాలంలోనూ ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా క అనేక మందికి సేవలు చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే తెల తెలవారక ముందే అవ్వాతాతలను నిద్ర నుంచి లేపి గుడ్ మార్నింగ్ అంటూ వారి చేతిలో పింఛన్ నగదు అందిస్తున్నారని తెలిపారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాల కోసం ఇబ్బందులు పడకుండా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందే విధంగా సేవలందిస్తుంటే కొంత మంది స్వార్థ రాజకీయాల కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండి పడ్డారు.ఈ సందర్భంగా ఉత్తమ వలంటీర్లను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామ కృష్ణ, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, సర్పంచ్ పసుపులేటి శివకుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, కాకుమాను సొసైటీ అధ్యక్షుడు కోంద్రు అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు కానుగుల పరమేశ్వరరావు, గేరా పున్నారావు, వల్లూరు సుధాకర్, ఎంపీడీవో రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త బలసాని

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసి పెద్దకొడుకుగా జగనన్న ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. 40వ డివిజన్ జన్మభూమినగర్‌లో బుధవారం స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'గుండె గుండెకు జగనన్న...గడప గడపకు కిరణన్న' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్తకు స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ఆడబిడ్డల మోములో చిరునవ్వులు చూసేందుకు మీ తోడుగా అక్కడ జగనన్న ఉన్నాడు.. ఇక్కడ మీకు అండగా ఈ కిరణన్న ఉన్నాడని భరోసా కల్పించారు. 2014 సంవత్సరానికి ముందు చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిండా ముంచారని, ఆ సమయంలో బ్యాంకులకు వడ్డీలు కట్టలేక డిఫాల్టర్లుగా మహిళలు మారారని గుర్తు చేశారు. నేడు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి బ్యాంకులో రుణాలన్నీ మాఫీ చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కలిగి ఉండాలని జగనన్న కాలనీలను ఏర్పాటు చేస్తున్న మహానాయకుడు మన జగనన్న అని తెలిపారు. జగనన్న పంపితే సామాన్యుడిగా మీ ముందుకొచ్చానని, తనను ఆశీర్వదించాలని కోరారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లు... సంక్షేమ వారధులు

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య
- పెదకాకానిలో వలంటీర్ల సేవలకు పురస్కారాల ప్రదానోత్సవం



అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పెదకాకాని: వలంటీర్లు... సంక్షేమ వారధులు అని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం గ్రామ వలంటీర్ల సేవలకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇద్దరికి సేవా వజ్ర అవార్డు ద్వారా రూ.45వేలు, ఐదుగురికి సేవా రత్న అవార్డు ద్వారా రూ.30వేలు, 370మందికి సేవా మిత్ర పురస్కారం ద్వారా రూ.15వేలు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లను సేవా పురస్కారం కింద మెమెంటో, నగదు అవార్డులు, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ జగనన్న మానసపుత్రికలు వలంటీర్లేనని తెలిపారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా కుల, మత, వర్గ, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల్ని ఆయన అందజేస్తున్నారని చెప్పారు. పేద ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే పథకాలను అందిస్తున్న వలంటీర్ వ్యవస్థ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటంతో ప్రతిపక్షాలు ఓర్వలేక నిందలు వేస్తున్నాయని ధ్వజమెత్తారు. పొన్నూరు నియోజకవర్గంలో రూ.1600కోట్లను వివిధ సంక్షేమ పథకాల కింద వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి వలంటీర్‌కు రూ.పది లక్షల ఇన్సూరెన్స్ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీడీఓ బి.వి. మల్లేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పెదకాకాని పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని పాల్గొన్నారు. ముందుగా పెదకాకాని వై జంక్షన్‌లో రూ.46 లక్షలతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ మల్టీపర్పస్ పెసిలిటీ సెంటర్ గోడౌన్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ప్రారంభించారు. రైతులంతా గోడౌన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మానవత్వం పరిమళించిన వేళ..



వృద్ధురాలితో స్వయంగా వేలిముద్ర వేయిస్తున్న తహశీల్దార్

ప్రత్తిపాడు: కొందరు అధికారులు విధుల్లో ఎంతటి అధికార దర్పాన్ని ప్రదర్శిస్తారో.. మరికొందరు అధికారులు అంతకు మించిన మానవత్వాన్ని చాటుతారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టకుండా తమకు చేయగలిగినంత చేసి వారి కళ్లలో ఆనంద బాష్పాలను నింపుతారు. అలాంటి దృశ్యమే ఇది. ప్రత్తిపాడుకు చెందిన సుంకిరెడ్డి ఆదిలక్ష్మి అనే డెబ్బై ఏళ్ల వృద్ధురాలు గత కొద్దిరోజులుగా పక్షవాతంతో బాధపడుతోంది. ఈమెకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాను మంజూరు చేసింది. ప్రస్తుతం స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుండటంతో బంధువులు ఆమెను బుధవారం ప్రత్తిపాడు–1 సచివాలయానికి ఆటోలో పడుకోబెట్టి తీసుకువచ్చారు. ఆమెను సచివాలయంలోనికి తీసుకువెళ్లేందుకు కుటుంబసభ్యులు పడుతున్న ఇబ్బందులు గమనించిన తహసీల్దార్ జి. రాఘవేంద్రరావు, సెక్రటరీ జాన్‌పీరా బయటకు వెళ్లి ఆమెతో మాట్లాడారు. సిబ్బందిని, అక్కడే విధుల్లో ఉన్న వలంటీర్లను పిలిపించి కుర్చీ తెప్పించి, ఆమెను సచివాలయంలోకి మోసుకుని వెళ్లారు. తహసీల్దార్ స్వయంగా వృద్ధురాలితో వేలిముద్ర తీసుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

నైపుణ్యతలు కలిగిన ఆలోచనలతోనే విజయాలు



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నైపుణ్యతలు కలిగిన ఆలోచనాశక్తితో విజయాల్ని సొంతం చేసుకోవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో 'సంతింగ్ డీప్లీ హైడెన్ ఆన్ మెటాకాగ్నిషన్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆలోచనలు, అభ్యాసం, సాధన ద్వారా మైండ్ మెచ్యూరిటీ మెరుగు పడుతుందని తెలిపారు. మైండ్ యువర్ పొంటమ్స్ సంస్థ సీఈవో జయచంద్రరావు మనిషి ఆలోచన ప్రక్రియలు, అవగాహన, వాటి వెనుకున్న నమూనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం అతిథుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేష్‌బాబుకు నేషనల్ బెస్ట్ రీసెర్చ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేంద్రబాబు

గుంటూరు మెడికల్: మల్లిక స్పైయిన్ సెంటర్ అధినేత, గుంటూరుకు చెందిన సీనియర్ స్పైయిన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబుకు జాతీయ ఉత్తమ పరిశోధన అవార్డు లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అవార్డు దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా రికార్డు సృష్టించారు. గుంటూరు ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని మల్లిక స్పైయిన్ సెంటర్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు డాక్టర్ నరేష్‌బాబు మీడియాకు వెల్లడించారు. వెన్ను, మెడ నొప్పి సమస్యలపై 2022–23 సంవత్సరంలో తమ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన 50 మందిపై తాము పరిశోధన చేశామన్నారు. సర్వైకల్ స్పాండిలైటీస్ సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన వారికి సాధారణంగా పడుకుని తీసే ఎమ్మారై వైద్య పరికరం ద్వారా పరీక్షలు చేయడం పరిపాటిగా పేర్కొన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా స్టాండింగ్ ఎమ్మారై ద్వారా నూతన విధానంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశామని తెలిపారు. ఈ పరిశోధనా విషయాన్ని ఇటీవల ముంబైలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ స్పైయిన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సదస్సులో ప్రజెంట్ చేశామని చెప్పారు. దీనికి అసోసియేషన్ వారు జాతీయ స్థాయిలో బెస్ట్ రీసెర్చ్ అవార్డును అందజేశారని వివరించారు.

డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి అవార్డు



గుంటూరు మెడికల్: రోగి మెలకువగా ఉండగానే ల్యాప్‌ట్యాప్‌లో సినిమాలు చూపిస్తూ బ్రెయిన్ ఆపరేషన్లు చేసి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న గుంటూరుకు చెందిన సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి ఇండో– ఫ్రెంచ్ అవార్డు లభించింది. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న సదస్సులో ఆయన ఇన్నోవేటీవ్ కంట్రిబ్యూషన్ ఇన్ బ్రెయిన్ రీసెర్చ్ అవుట్ స్టాండింగ్ ఓరియేషన్ అవార్డు–2024ను అందుకున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి బ్రెయిన్ వ్యాధి నిర్ధారణలో న్యూరో నావిగేషన్‌తో ఆపరేషన్లు చేస్తున్నందుకు అవార్డును ఇచ్చారు.

దేశ భాషలందు తెలుగు లెస్స



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థినులు

కాకుమాను: అమ్మలాంటి మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదని ఎంఈవో కెఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం తెలుగు భాష విశిష్టత గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి మాతృ భాష బోధనతోనే సాధ్యమని తెలిపారు. విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ, భావావగాహన మాతృభాష ద్వారానే సులభంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇంగ్లిష్ మోజులో పడి తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతూ, తల్లి భాష తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు విశిష్టత గురించి వ్యాసరచన, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించి విజేతలకు తెలుగు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 విజయ్ భాస్కర్,హెచ్ఎం రామ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎఫ్ ప్యానల్స్‌తో బోధించాలి

పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు లింగేశ్వర రెడ్డి



విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను పరిశీలిస్తున్న లింగేశ్వరరెడ్డి

యనమదల (ప్రత్తిపాడు): ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)ను వినియోగించి బోధన చేయాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు బి. లింగేశ్వరరెడ్డి అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. తరగతి గదులు, విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో పాటు విద్యా సామర్థ్యాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బైజుస్ ట్యాబ్ వినియోగ వ్యవధిని పెంచాలని సూచించారు. జోన్–3 పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా స్విఫ్ట్ చాట్ యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న తరగతులు, సబ్జెక్టుల వివరాలు ఏపీ టీచర్ బాట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులంతా టోఫెల్ ఇంగ్లిష్ బోధించే విషయంలో ఒక్కొక్క విద్యార్థిని దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాజుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీవీఐటీలో సినీ హీరో వరుణ్ తేజ్ సందడి



పెదకాకాని: మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ వీవీఐటీ కళాశాలలో సందడి చేశారు. ఆయన నూతనంగా నటించిన బిగ్గెస్ట్ ఏరియల్ వార్ డ్రామా 'ఆపరేషన్ వాలంటైన్' చిత్రం మార్చి 1న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆయన బుధవారం వీవీఐటీని సందర్శించారు. చిత్రం ద్వారా జవాన్ల త్యాగాలు వారి ధైర్యసాహసాల్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ చిత్రం చూసిన అనంతరం భారతీయులుగా పుట్టినందుకు గర్వంగా బయటికి వస్తారని చెప్పారు. ప్రేక్షకులకు నిరంతరం కొత్తదనం అందించే ప్రయత్నం చేస్తుంటు ఉంటాననీ, ప్రేక్షకుల డబ్బుతో కొనే టికెటుకు న్యాయం చేయాలని కష్టపడతానని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

29నుంచి శ్రీ వారాహి సహిత శత చండీ కదళీ యాగం

పాత గుంటూరు: తిరుపతి తిరుచానూరు శ్రీ సప్తమాతక పరిహార వారాహి శక్తిపీఠం, శ్రీ సప్త కన్యకా శక్తిపీఠం లక్ష్మీ పురం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి మార్చి 2వ తేదీ వరకు విజయవాడ తాడిగడపలోని అనుమోలు గార్డెన్స్‌లో లోక కల్యాణార్థం రాష్ట్రస్థాయి శ్రీ వారాహి సహిత శత చండీ కదళీ యాగం నిర్వహించనున్నట్లు శ్రీ ఆదివారాహి శక్తి టెంపుల్ పీఠాధిపతులు శ్రీ మహా రుద్ర స్వామి పేర్కొన్నారు.అరండల్ పేటలోని హోటల్లో బుధవారం నిర్వహించిన భక్తుల సమావేశంలో యాగం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. మహా రుద్ర స్వామి మాట్లాడుతూ 29న వేకువ జాము నుంచి వివిధ పూజా క్రతువులతోపాటు 108 హోమ గుండాలతో శ్రీ వారాహి సహిత శత చండి కదళీ యాగం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుద్దుకూరి లక్ష్మీపార్వతి, పద్మావతి నారాయణ, డాక్టర్ సంఘమిత్ర, భాను, శ్రీకాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

సందడిగా హిందూ కాలేజీ హైస్కూల్ వార్షికోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మెరుగైన విద్యాబోధనతో విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని హిందూ కాలేజీ హైస్కూల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్ సూచించారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్ బుధవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నందనం పాటి రామాంజనేయులు, పాఠశాల కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన క్రీడా దినోత్సవంలో వ్యాయామ విద్య ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ మొహబూబ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

ఆరోగ్య పరిరక్షణలో మహిళలకు శ్రద్ధ అవసరం

లక్ష్మీపురం: మహిళలు ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు సంబంధిత వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని గుంటూరు రైల్వే డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక సూచించారు. పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో బుధవారం రుతుస్రావ పరిశుభ్రతపై మహిళా సంక్షేమ సంస్థ, డీఆర్ఎం సతీమణి, గుంటూరు డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఆశాలత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మంచి రుతు ఆరోగ్యం, పరిశుభ్రత పద్ధతులతో అంటువ్యాధుల్ని నివారించవచ్చని తెలిపారు. అనంతరం మహిళలకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ న్యాప్‌కిన్‌లను పంపిణీ చేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



గుండవరం(చేబ్రోలు): పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ కాలుష్యం నుంచి కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి సూచించారు. మండలంలోని గుండవరంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం ప్రభుత్వ పాఠశాల, పంచాయతీ కార్యాలయం, రహదారుల పక్కన సర్పంచ్ చుక్కా సాయి నాగేంద్రమ్మ, విద్యార్థులు మొక్కలు నాటారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాధాన్యత తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పక ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి, గ్రామ సర్పంచ్ చుక్కా సాయి నాగేంద్రమ్మ మాట్లాడుతూ మొక్కలు సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పి.ఎ. శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.